# గైడ్

పరిమళా సోమేశ్వర్

నీటుగా ముస్తాబై నగరయాత్రకు సిద్ధంగా వచ్చింది ఇన్ఫర్మేషన్ ఆఫీసుముందు 'మనోరమ'

ఎఱ్ఱటి పాప్లిన్ క్లాత్‌మీద తెల్లటి పూలున్న 'మినీస్కర్టు' ధరించిన 'ఎలిజా' హేండ్‌బాగ్ ఊపుకుంటూ ఆఫీసులోనుండి బయటకు వచ్చింది. ఆమెతో పాటుగా భాగ్యనగర సందర్శనార్థం వివిధ ప్రదేశాలనుండి వచ్చిన జనం కూడా 'మనోరమ' దిక్కుగా నడిచేరు.

ఎలిజా అందరికంటె ముందుగా బస్సెక్కింది; ముందుసీట్లో కూర్చుని తలను సీటువీపుకాన్చి బస్సులోకి ఎక్కుతున్న వ్యక్తులను ఒక్కొక్కరినే పరిశీలనగా చూడసాగింది.

మొదట మెడలో కెమెరాని తగిలించుకున్న ఓ రోమన్ క్రాపు జల్సా రాయుడు ఎక్కేడు; అతని వెనుక భార్యా బిడ్డలతో సహా బిలబిలమంటూ ఎక్కేడు ఒక 'కుటుంబయ్య' వీళ్ళ వెంట ఓ ఇరవై ఏళ్ళ యువతి పాతికేళ్ళ యువకుడు వచ్చేరు. వాళ్ళిద్దరూ 'హనీమూన్' కోసం బయల్దేరిన నవ దంపతులని 'గైడ్' వృత్తిలో మూడేళ్ళుగా ఉంటూవచ్చిన ఎలిజా యిట్టే గ్రహించింది. తరువాత ఖద్దరులాల్చీ, ఖద్దరుపంచ ధరించిన ఒక పెద్దమనిషి, అతని అనుయాయుడుగా కనపడుతున్న మరో వ్యక్తీ ఎక్కేరు. వాళ్ళ వెనుక బిత్తరచూపులు చూస్తూ కంగారుగా ఎక్కేరు నీలికావిపంచలు చొక్కాలు తొడుక్కున్న యిద్దరు రైతు యువకులు తరువాత ఠీవిగా, నెమ్మదిగా ఎక్కేరు పాశ్చాత్యదేశాల నుండి వచ్చిన వ్యక్తులుగా కనపడుతున్న

దంపతులిద్దరు; ఆఖరున పాన్ నములుతూ ప్రవేశించేరు పొడుగాటి షేర్వాణీలో ఒక నలభై యేళ్ళ వ్యక్తి.

ఎవరి సీట్లలో వారు కూర్చున్నాక, క్లుప్తంగా ఆనాడు వారు చూడబోయే ప్రదేశాలను గూర్చి వివరించింది ఎలీజా.

'మనోరమ' కదిలింది వయ్యారంగా.

మొదట నాంపల్లి మీదుగా పబ్లిక్ గార్డెన్స్ దగ్గరకు వచ్చి ఆగింది-టూరిస్ట్ బస్సు

అందరూ ఒకరినొకరు తోసుకుంటూ దిగేరు బస్సులోనుండి. 'కుటుంబయ్య' గారి పిల్లలు బిలబిలమంటూ పరుగెత్తేరు గార్డెన్సులోపలికి అరుస్తూ, కేకలు పెడ్తూ: అమ్మానాన్నలు వారిస్తున్నా వినకుండా మొక్కమొక్కనీ చేత్తో పట్టుకుంటూ పరుగులు తియ్యసాగేరు రోమన్ క్రాపువాలా కెమెరాను సరిచూసుకుంటున్నాడు మంచి 'యాంగిల్సు' కోసం.

'పాశ్చాత్యదంపతులు లోకంతంలో కొంచెం మూతులు వంకరగా పెట్టి మాట్లాడుకుంటూంటే వారికి గజం దూరంలో నడుస్తూ వాళ్ళ ప్రతి కదలికనూ దొంగచాటుగా పరీక్షచేస్తూ ఆశ్చర్యాద్భుతరసాల్లో తేలి ఓలలాడుతున్నారు రైతు యువకులు. ఖద్దరు లాల్చీ పెద్దమనిషి మెత్తని పచ్చికమీద కూర్చుని ఉపన్యాసం ఇస్తుంటే తలూగిస్తూ వినయంగా వింటున్నాడు అయన అనుచరుడు. షేర్వాణీ ధరించిన పెద్దమనిషి ప్యాకెట్ ట్రాన్సిస్టరును 'ఆన్' చేసి మెల్లగా నడుస్తూ తిరగసాగేడు.

ఎలీజా వాళ్ళతోపాటు తిరక్కుండా హెల్తుమ్యూజియం ముందున్న పచ్చికలో కూర్చుని అరగంటలో అందరినీ తోటచూసి ఇక్కడికి రమ్మనిచెప్పింది.

వృత్తిరీత్యా రోజూ చూడటానికి అలవాటు పడిపోయిన ఆ గార్డెన్సు ఆమెకు ఎలాటి ప్రత్యేకమైన ఆనందాన్నీ, ఆకర్షణనీ ఇవ్వలేకపోయినయ్. కాళ్ళురెండూ కొద్దిగా బారజాపి చేతులు వెనకనేల కానించి తల పైకెత్తి చూసింది ఎలీజా. లేత నీలవర్ణపు ఆకాశంలో మెల్లగా కదులుతున్న తెలిమబ్బుల సోయగాలను తిలకిస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయింది కొంతసేపు.

హఠాత్తుగా 'క్లిక్' మన్న శబ్దం వినిపించినట్లయి ఉలిక్కిపడింది ఎలీజా

ఆమెకు పదిగజాల దూరంలో 'రోమన్ క్రాపు' కెమెరాను మెడకు తగిలించుకున్నాడు. "థాంక్యూ మేమ్!" అన్నాడు గారపట్టిన పళ్లు బయటపడేట్టు నవ్వుతూ.

ఆమె నవ్వింది, సుస్మితంగా, అందంగా.

అతను అటు తిరగగానే అదే భంగిమలో కూర్చుని తన శరీరాన్నంతటినీ ఓ మారు గర్వంగా చూసుకుంది.

లోతుగా కత్తిరించిన జాకెట్టులో

నుండి నిండైన రొమ్ములమధ్య గల సన్నని రేఖ స్పష్టంగా బయటకు కనపడుతోంది. నగ్నంగా ఉన్న మోకాళ్లు సూర్యరశ్మిలో – నిగనిగమెరిసిపోతున్నాయ్. తేనెవర్ణంలో ఉన్న ఉంగరాల జుట్టుకొసలు మృదువుగా మెడపక్క భాగాలను తాకుతూ గిలిగింతలు పెడ్తున్నాయ్. నిండు యౌవనంలో ఉన్న పొందికైన తన అవయవాలన్నటినీ చూసుకుని గర్వంగా తృప్తిగా నవ్వుకుంది ఎలిజా

ఆమె లేచింది. రెండుచేతులూ వెనక్కుకట్టుకుని అటూ ఇటూ పచార్లు చేయసాగింది. అలా నడుస్తూనే మాటి మాటికీ తనశరీరాన్ని తానే పైనుండి కిందకు పరిశీలనగా చూసుకుంటూ రహస్యంగా తృప్తి పొందసాగింది.

కొంతసేపలా గడిచిన తరువాత ఒక్కరొక్కరే రాసాగేరు ఆమె వైపుకు; వాళ్ళందరూకూడా దూరాన్నుండి తనవంకే తదేకంగా చూస్తూ రావటం కనిపించిందామెకు.

వాళ్ళందరినీ హెల్తుమ్యూజియంలోకి తీసుకువెళ్ళింది. అందులో విగదులు చిన్నవిగా ఉండటంవల్లను, వీళ్ళుకాక అప్పటికే యింకా చాలామంది జనం వచ్చి ఉండటంవల్లను కిటకిటలాడిపోతోంది మ్యూజియం. జనం ఒకరి నొకరు తోసుకుంటూ ఆరోగ్య సూత్రాలను బోధించే చిత్రాలను, వాక్యాలను చూసుకుంటూ నడుస్తున్నారు, ఆ సందట్లో ఒకరిద్దరు తనను రాచుకుంటూ పోవటం 'రోమన్ క్రాపు' మోచేయి తనకుడి రొమ్మును

తాకటం – యివేమీ గమనించనట్లే నటించింది ఎలిజా.

'కుటుంబ నియంత్రణ'ను ప్రచారం చేసే చిత్రం ముందు నిలబడిందామె. ఆమె దగ్గరకు 'హనీ మూన్' దంపతులు వచ్చేరు. అతను ఎలిజాదగ్గరగా నిలబడి ఎలాగైనా ఆమెతో మాట్లాడాలని ఏదో అర్థంలేని ప్రశ్న వేసేడు. ఆమె సమాధానం చెప్పినా విడవకుండా అక్కడే నిలబడి సంభాషణని పొడిగించసాగేడు. అతని 'అర్ధాంగి' తన భర్త ఒక ఆకర్షణీయమైన యువతితో అంత చనువుగా మాట్లాడటం భరించలేక తన అసూయను, అయిష్టాన్ని భర్తకుచెప్పే చనువు, సాహసం లేకనూ అసహనంగా నిలబడింది– వాళ్ళకు కొంచెం దూరంలో.

చెప్పులులేని ఆమె కాలివేళ్ళకుగల మట్టెలను తనకుదగ్గరగా నిలబడిన ఆతని ఎడమచేతి వేళ్ళకుగల మూడు ఉంగరాలను మార్చి మార్చిచూస్తూ నిలబడింది ఎలిజా.

నీరుకావి దుస్తుల రైతు యువకులు గాజు పెట్టెల్లో ఉంచిన మృతశిశువుల కళేబరాలను నోళ్ళు తెరచుకుని చూడసాగేరు.

"ఏందిరోయ్. మడిసి పిల్లలు ఇందులోకి ఎట్ట దూరేర్రోయ్." అన్నాడొకతను ఆశ్చర్యంగా వెఱ్ఱికేక పెడ్తూ.

"ఆళ్లు బతికునోళ్లు కాదురా. సచ్చినోళ్ళను తీసుకొచ్చి ద్రావకంలో పడేత్తారట."

"ఏం దేంది! అట్టసెప్పు"

"మన రాజగోపాళంగారి మూడో అబ్బాయి యిక్కడే డాట్టరుకోర్సు సదువుతున్నాడు కదూ? ఆ డోపాలి చెప్పేళ్ళ – నాతో."

"బలేబలే సిత్రంగా ఉందే."

"ఇంక టైమయిపోయింది పదండి" అంది ఎలిజా ఇంగ్లీషులో. అంతా ఆమెననుసరించేరు

అందరూ బస్సులోకి ఎక్కాక ఎలిజా 'రవీంద్ర భారతి'ని, 'రేడియో స్టేషను'ని బయటనుండే చూపించింది

'మనోరమ' వేగం పెంచింది

ఎక్కడా ఆగకుండా మూకుడుగా పరుగెత్తుకుంటూ వెళ్ళి 'సాలార్ జంగ్ మ్యూజియం' ముందు ఆగింది 'మనోరమ.'

అందరూ దిగేవరకు ఎలిజా సీట్లోనే కూర్చుంది. ఆఖరున రైతు యువకులు ఓరకంట ఆమెను చూస్తూ దిగేరు.

బస్సు దిగబోతూ ఒకతను "ఒరేయ్ నర్సిగా. 'అది' ఆడదా, మొగోడా?" అనడిగేడు గట్టిగా గుసగుసలాడే కంఠస్వరంతో. నర్సిగాడు కిసుక్కున నవ్వేడు.

"ఎర్రినాయాలా! ఆ మాత్తరము తెలీదూ? సూత్తే కనపట్టంలా...? ఆడదే!"

"ఆడదైతే మరి మొగాన బొట్టు

నేదేం? చెవులకు కమ్మలు లేయే? జుట్టు మొగోడి క్రాపునాగుందేమరి?"

"అళ్ళంతేలే. అట్టనే ఉంటారు. అళ్లు మనోళ్ళుకాదు. 'బాస' మాట్లాడే వోళ్ళంతా దాన్లానే ఉంటారు."

"బలేబలే!"

ఆ రైతు యువకు లిద్దరూ తనని ఉద్దేశించె మాట్లాడుకుంటూన్నా రని ఎలిజాకు తెలుసు. ఆమెకు తెలుగు బాగానే మాట్లాడటం వచ్చు. ఆమె పుట్టి పెరిగింది చిత్తూరులో కాని బయటకు వస్తే ఎన్నడూ ఒక్క తెలుగు మాటకూడా ఉపయోగించదు. ఆమె వేషం అదీ చూసి అంతా ఆమె 'ఆంగ్లో యిండియన్' అనీ ఆమెకు తెలుగు రాదనీ అనుకుంటారు

ఆ పల్లెటూరి యువకుల సంభాషణ విన్న ఎలిజాముఖం కొద్దిగా చిన్న బోయింది. ఆమె మనసు చివుక్కుమంది. కానిఆమె అంతరాంతరాళాల్లో దాగిన 'సెన్సాఫ్ హ్యూమర్' చటుక్కున విరగబడి నవ్వించింది.

"ఎలిజాకూడా దిగి వాళ్ళవెంట నడచింది.

ఒక్కొక్క గదిలో అమర్చి ఉన్న వస్తువులను చూస్తుంటే అందరికీ సంతోషంగా, ఆశ్చర్యంగా ఉంది. పిల్లల భాగంలో అమర్చబడిన బొమ్మలను, వాటని చూసేక 'కుటుంబయ్యగారి' సంతానం యొక్క ఆనందానికి పట్టపగ్గాలేక పోయినయ్. ఆ బొమ్మనీ ఈ బొమ్మనీ తాకటం. చేతికి వీలుగా ఉన్న వస్తువులను పైకి ఎత్తటంకూడా చేస్తూంటే తల్లి తలో రెండూ అంటించింది. దాంతో వాళ్ళు 'కీచు కీచు' మంటూ ఏడుపు లంకించుకున్నారు. పిల్లలలా అసభ్యంగా ఏడవటం అవమానకరమని భావించిన కుటుంబయ్య "ఏడుపు మానుతారా, లేదా?" అంటూ మరో రెండు అంటించేడు.

పుష్టికరమైన అవయవాలతో పరిపూర్ణ సౌందర్యంతో ఆకర్షణీయంగా ఉన్న పాలరాతి స్త్రీ ప్రతిమలను నోళ్లు తెరచుకుని చూడసాగేరు - రైతు యువకులు

"ఒరేయ్. ఈ బొమ్మకు గుడ్డల్లేవు రోయ్" గుసగుసమన్నాడు ఒకతను.

"అదంతేరా. మదుసులకుమల్లె అన్ని బొమ్మలూ గుడ్డలు కట్టుకోవు."

నగ్నంగా ఉన్న గ్రీకు సుందరిని చూసి చటుక్కున కళ్ళు తిప్పేసుకుంది కుటుంబయ్యగారి భార్య 'హవ్వ!' అని బుగ్గ నొక్కుకుంటూ.

ఆ గది దాటేవరకు ఆ బొమ్మనే వెనక్కి తిరిగితిరిగి చూస్తూ వెళ్లేరు రైతుయువకులు.

ఆ మ్యూజియంలోకల్లా పిల్లలనీ పెద్దలనీ అందరినీ ఆకర్షించింది గడియారంలో గంటలుకొట్టే మనిషి.

తలుపుతెరచుకుని ఒకతను గబు

క్కున బయటకువచ్చి పన్నెండు గంటలుకొట్టి మళ్ళీ తుర్రున లోపలికి పోయి తలుపేసుకోగానే పిల్లలంతా చప్పట్లుకొట్టేరు అరుస్తూ.

"ఆహా!" అంటూ కుటుంబయ్య గారి భార్య ముక్కుమీద వేలేసుకుంది. రైతుయువకులు అది భూలోకమన్న సంగతే మర్చిపోయేరు కాసేపు. ఏ మాయలమారి ఫకీరో తమనో విచిత్ర ప్రపంచంలోకి తీసుకువెళ్ళినట్లు అనుభూతిపొందేరు.

ఖద్దరులాల్చీ పెద్దమనిషి ఆ రకమైన గడియారం హైదరాబాద్‌లో తప్ప ఇండియాలోనేకాక ప్రపంచంలోని మరే ఇతర దేశంలోకూడా లేదని సాధికారంగా ప్రకటిస్తుంటే అతని అనుచరుడు అక్షరాలా ఆయన అభి ప్రాయాన్ని నమ్మటానికి ప్రయత్నించేడు.

ఆ తరువాత చార్‌మినార్ దగ్గరకు తీసుకువెళ్ళింది 'మనోరమ' వాళ్ళందరినీ.

ఆ షేర్వాణీవాలా చార్‌మినార్ కింద నమాజ్ చేసేడు. అతను నమాజ్ చేస్తున్నంతసేపూ పాశ్చాత్య దంపతులు అతనినీ అతనిలాగానే నమాజ్ చేస్తున్న మరికొందరినీ వింతగా పరిశీలిస్తూ నిల్చున్నారు. అప్పటికే మిగతా వాళ్ళంతా చార్‌మినార్ ఎక్కటం మొదలెట్టేరు.

నమాజ్ ముగిసేక పాశ్చాత్య దంపతులు అతనిని నమాజ్‌ని గురించి ఏదో అడిగేరు. అతను సగం ఇంగ్లీషు, సగం ఉర్దూ కలిసిన విచిత్రమైన భాషలో వాళ్ళకు బోధపరచటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. అలా మాట్లాడుకుంటూ వాళ్ళు ముగ్గురూ కూడా చార్‌మినార్ ఎక్కసాగేరు.

చీకటిగా ఉన్న మెట్లమీద కుటుంబయ్యగారి పిల్లవాడి కాలుజారింది 'అమ్మో!' అంటూ గావుకేక పెట్టి వాడు తల్లిని కౌగలించుకున్నాడు

"నాయనా భద్రం! ఒసే సీతాలూ, రాధీ! జానకీ! శీనుగా, వెంకన్నా! జాగ్రత్త! చూసినడవండి. ఒసే అమ్మడూ నువ్విలారావే. ఒరేయ్ చెవులసన్నాసీ! నువ్వు నాన్నగారి చెయ్యిపట్టుకోరా! అమ్మా! నాయినా! ఏడుకొండలవాడా!" అంటూ ఆప సోపాలు పడుతూ ఎక్కింది ఒక్కొక్క మెట్టే ఆవిడ. చివరికెలాగైతేనేం అర గంటలో అంతా చార్‌మినార్ చివరి భాగం చేరుకున్నారు.

మట్టమధ్యాహ్నపు సూర్యుడు తీక్షణంగా వెలిగిపోతున్నాడు. అతని తీక్షణతకు ఆగలేక ఆకాశంరంగు వెలిసిపోయి వెలవెలాబోతోంది.

కర్చీపుతో నుదుటిమీద బుగ్గలమీద సున్నితంగా అద్దుకుంది ఎలిజా. లిప్‌స్టిక్ రాసిన పెదవులు ఎండి బిగు




సుకు పోయినయ్. బుగ్గలకు రాసు కున్న రోజారంగు చెమటలో తడిసి చెదిరిపోయింది.

చార్మినార్ అంచున నిలబడి క్రిందకుచూసింది చీమలబారుల్లా సాగి పోతున్న జనప్రవాహాన్ని తదేకంగా చూస్తూ నిల్చున్న ఎలిజాలో ఏదో చిత్రమైన కదలికబయల్దేరింది ఎప్పుడూ అలా అంత ఎత్తున నిల్చునే గబాల్న క్రిందికి దూకాలన్న ప్రబలమైన కోరిక కలుగుతూంటుంది. ఆమెకు దూకేక ఆ పైన ఏమవుతుందో! తన యీ సుందర దేహాన్నుండివిడిపోయిన కాళ్లూ చేతులూ, వికృతంగా తెరిచిన నోరూ నిలువుగుడ్లు వేసిన కళ్ళు—చావు అంత వికారంగా,భయంకరంగాఉంటుందా—ఐనా మృత్యువులో విచిత్రమైన ఆక ర్షణ ఏదో ఉంది. అదో గొప్ప సెంప్టే షన్! నవ్వుకుంది ఎలిజా.

పావుగంట గడచేక ఆదరాబాదరా అందర్నీ క్రిందకు తరిమింది ఎలిజా.

హడావిడిగా "నెహ్రూ జూలాజి కల్ పార్కుకు" చేరుకుంది టూరిస్టు బస్సు

అక్కడ చల్లని చెట్లనీడల్లో కూర్చుని అందరూ తాము తెచ్చిన తినుబండా రాలను బయటకు తీసి తినసాగేరు

కుటుంబయ్యగారి భార్య గుడ్డ సంచిలోనుండి సత్తుకారియర్ను బయ టకు తీసింది. ఒక్కొక్కగిన్నె తీసి అందులోనుండి పులిహోర, గారెలుతీసి రెండు విస్తళ్లలో వడ్డించింది పది

నిమిషాల్లో ఒక్క మెతుకన్నా మిగల కుండా ఊర్చిపారేసేరు పిల్లలందరూ. తరువాత మరో చిన్న కారియర్ లో తీసుకొచ్చిన నీళ్ళమజ్జిగను అందరికీ తలా కొంచెం యిచ్చింది తల్లి.

రైతు యువకులు ఎవరూ లేని చోట కూర్చుని తాము తెచ్చుకున్న చద్దన్నం మూటలువిప్పేరు. ఆవకాయలో అన్నాన్ని పెద్దసైజు నిమ్మకాయంత ముద్దలుచేసి వాళ్ళిద్దరూ మింగుతుంటే అప్పుడే తిని అటువచ్చిన కుటుంబయ్యగారి పిల్లలు వెంకన్న, శీను నోరూరించుకుంటూ చూస్తూ నిల్చున్నారు.

"అబ్బ! ఎర్రగా ఎంత బాగుందో ఆవకాయ అన్నం! మనకోముద్ద పెడ్తే బాగుండును," అనుకున్నా రిద్దరూ.

వెస్టర్న్ డ్రెస్ ఫుల్, ఖద్దరు లాల్చీ పెద్దమనిషి, అతని అనుచరుడు రోమన్ క్రాపు, షేర్వాణీవాలా, ఎలిజా కాంటీనుకి వెళ్ళేరు తినటానికి; హానీమూను దంపతులు యింటిదగ్గరనుండి తెచ్చిన బూందిలడ్డూలు, కారప్పూస తిన్నారు కాంటీను ముందరే ఉన్నా చెట్లదగ్గర కూర్చుని

ఉపాహారం ముగించుకున్నాక ఎలిజా టాయ్ లెట్ రూమ్ లోకి వెళ్ళి ముఖానికి పౌడరు రాసుకుని బుగ్గలకు రోజారంగు పులుముకుని పెదవులకు లిప్ స్టిక్కు పూసి తల నోమారు దువ్వుకుని 'ట్రిమ్'గా తయారై బయటకు వచ్చింది. చక్కగా అలంకరించుకుని నడచివస్తున్న 'ఎలిజా'ను చూసి లడ్డుండ నోట్లో పెట్టుకుంటున్న 'హానీమూను' యువకుడు తినటంకూడా మానేసి ఆమెవంకే కన్నార్పకుండా చూడటం మొదలెట్టేడు, తనభర్త చూపులను అంతబలంగా ఆకట్టుకున్న ఎలిజాను చూసేక ఆ యువతికి యింక తిను బండారా లేవీ గొంతుదిగలేదు. రోషముతో, అవమానంతో నిండిన కన్నీరు ఆమె గొంతులో గరగరమంది. ముందు రెంకకు నల్లబారిన ఆమె చామనచాయ మరింత నల్లబడిపోయింది —నిరాశతో; దుఃఖాతిశయంతో.

మనుష్యుల మనోభావాలను అర్థం చేసుకోగల శక్తిని ఉగ్గుపాలతోనే అలవర్చుకున్న ఎలిజా అల్లంత దూరంలో ఉండగానే ఆ హానీ మూను దంపతుల ముఖాలలో వ్యక్తమౌతున్న భావాల భాషను అర్థం చేసుకునికూడా చేసుకోనట్లే, వారి నసలు చూడనట్టే రీవిగా వాళ్ళముందునుండి నడచి వెళ్ళింది

ఒకప్రక్క రీవి, మరోవంక వయ్యారము పోటీపడుతున్నట్లుగా నడుస్తున్న 'ఎలిజా'కు ఒకజతకళ్ళు తనని గుచ్చి గుచ్చి చూస్తున్నట్లు మరోజతకళ్ళు తన వంక అసూయగా, నిస్సహాయంగా, విచారంగా చూస్తున్నట్లూ తెలుసును. ఎండకు తనముఖాన్ని చూపటం ఇష్టం




లేక నీడగావున్న ప్రదేశాల్లోనే నడుస్తూ తిరగసాగింది ఎలిజా.

ఖడ్గమృగం, నీటిగుఱ్ఱం, మరికొన్ని విచిత్రమైన జంతువులను చూసి వచ్చి చివరకు 'ఎక్వేరియం'లోకి వచ్చేరు అంతాను. ఆ ఎక్వేరియం చూస్తున్నంతసేపూ ఖద్దరు లాల్చీ పెద్దమనిషి 'బొంబే'లో ఉన్న "తారాపూర్ వాలా ఎక్వేరియం" ముందు యిది దిష్టి తిప్పటానికికూడా పనికిరాదనీ ఆ బొంబేలో ఉన్నంత పెద్ద ఎక్వేరియం ప్రపంచంలోనే చాలా అరుదనీ ధారాళంగా ఉపన్యాసం యిస్తూనే ఉన్నాడు తన అనుచరుడికి.

రోమనుక్రాపు, హానీమూను యువకుడు తనవంక ఆశగా చూస్తూ గుటకలు మింగటం గమనించిన ఎలిజా గర్వంగా నవ్వుకుంది. మిడిసిపడుతున్న తన యౌవనాన్ని చూసి మురిసిపోయింది కొంతసేపు. వాళ్ళిద్దరూ తనదగ్గరకు వచ్చి ఏవేవో సందేహాలున్నట్లు అడగటం, లోతుగా కత్తిరించిన తనజాకెట్టు లోపలికీ, తనకళ్ళలోకీ ఎర్రటి తనశరీర ఛాయలోకీ మార్చిమార్చి. చూడటం...యివన్నీ గమనించికూడా యేం తెలియనట్లే వాళ్ళతో అతిసహజంగా మాట్లాడింది.

రెండుగజాల దూరంలో కొండ చిలువదగ్గర నిలబడి తనభర్త ఆ అమ్మాయికి దగ్గరగా నిలబడి కళ్ళల్లో మెరు

పులు, పెదవుల్లో చిరునవ్వులు కురిపిస్తూ మాట్లాడుతూంటే చూస్తున్న ఆ యువతి ముఖంలోని 'ఎక్స్‌ప్రెషను' చూసి ఎలిజాకి గుండెను తొలచినట్లయింది ఆ యువతి హృదయంలో భగభగమండుతున్న అగ్నిజ్వాలలు తన హృదయంలోకి ప్రవేశిస్తున్నట్లనిపించి చటుక్కున సంభాషణను తుంచేసి "టైమయిందింకపదండి, గోల్కొండ పోవాలి," అంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది.

ఆమె మనసంతా చెదరిపోయింది. ఆ యువతి కళ్ళే మాటిమాటికీ ఆమెకు కనపడసాగినయ్. తనుకూడా స్త్రీయే; మరో స్త్రీ యొక్క అంతర్యాన్ని అర్థం చేసుకోవటం ఏమంత కష్టమైన పనికాదు తనకి.

స్త్రీత్వంలోని ఆశలు, నిరాశలు, నిస్పృహ, నిస్సహాయత, అసూయ, ఆరాటం అన్నీ ఒకచోట మూర్తీభవించినట్లున్నాయ్ ఆ యువతి కళ్ళు

వివాహమైన కొద్ది సంవత్సరాలలోనే పిల్లలు, జబ్బులు, దరిద్రం ఆకర్షణ నశించిపోయిన భార్యా, అంతర్యము చచ్చిపోయిన భర్త ... అన్నీ కలసిన ఆ జీవితం నరకసదృశంగా ఉంటుందన్న నిజాన్ని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిముగ్గురు అక్కయ్యల జీవితాలను, నలుగు రన్నయ్యల జీవితాలను క్షుణ్ణంగా చదివి తెలుసుకుందా యువతి. అందుకే కనీసం వివాహపు తొలిరోజుల్లో లభించిన మాధుర్యాన్నైనా గుండెలో దాచుకుని, ఆ అనుభవాల జ్ఞాపకాలతో శేషజీవితాన్ని అర్థ్రం చేసుకోవాలని ఆమె ఆరాటపడుతోంది.

కాని మగవాడి మనసు భ్రమరంలాటిది; అందమైన ఏపువ్వువైపుకో ఆకర్షింప బడటం దాని సహజగుణం. నీతి నియమాలు, సంఘంలోని కట్టుబాట్లు, పెద్దల ఆదేశాలు శరీరాన్ని కొంతవరకు కట్టివేయగలవేమో. కాని మనసుని శాసించి దానికి తగుశిక్షణ నిచ్చే నీతి సూత్రాలేవీ యింతవరకు పుట్టలేదు. ఒకవేళ అలాటివేమైనా ఉన్నా, అవి సామాన్య మానవుడి అవగాహన శక్తికి అతీతమైనవి! ఎలిజా నిట్టూర్చింది.

'మనోరమ' బద్ధకంగా కదిలింది గోల్కొండవైపుకు. ముందు సీట్లో కూర్చున్న ఎలిజా తన కుడిపక్క సీట్లో కూర్చున్న హనీమూన్ దంపతుల మధ్య జరుగుతున్న సంభాషణని శ్రద్ధగా వినసాగింది.

బహుశా అంతకుముందే వాళ్ళ సంభాషణ ప్రారంభమైన ఉంటుంది.

"అసలు మనం ఇక్కడకు వచ్చిపది ఎందుకు? ఇద్దరంకలసి సుందర ప్రదేశాలని చూస్తూ వాటిలోని సౌందర్యాన్ని తిలకిస్తూ, ఒకరి ఆనందంలో




ఒకరు పంచుకుంటూ, ఈ మధుర క్షణాలను భావిజీవితంలో శాశ్వతం చేసుకోవాలనేకదా 'హనీమూన్' యొక్క ఉద్దేశ్యం? కాని మీకు ఇప్పుడే నా మీద వెగటు పుట్టేసింది! ఇకముందు..." దుఃఖంతో ఆమెకింక మాటలు పెగల్లేదు

"ఐతే నువ్వనేది ఏమిటి? ఇరవై నాలుగు గంటలూ నీ ముఖమే చూస్తూ కూర్చోవాలా? ఇంకో ఆడదాన్ని కన్నెత్తి చూడకూడదు! పన్నెత్తి మాట్లాడకూడదు! అదే నా నీ ఉద్దేశ్యం? తీవ్రంగా ఉందతని కంఠస్వరం.

"ఎవరినీ కన్నెత్తిచూడకూడదని కాదు నే నడిగేది. ఒక్కసారి మీ మనసును తరచిచూసుకోండి ప్రయాణమైన దగ్గరనుండి చూస్తున్నాను- నా ఉనికిని గూర్చిగాని, అసలు మనం ఇక్కడకు ఎందుకొచ్చేమని కాని ... ఏమన్నా ఉందా ఆలోచన-మీకు..."

"ఛ! ఏడుపుగొట్టు మొహమూ! కాస్త పరాయిచోటుకు వెళ్ళినప్పుడైనా హాయిగా నవ్వటం చేతకాదు. నా ఖర్మకొద్దీ దొరికావు" చటుక్కున ఆమె పక్కనుండి లేచి వెనకసీట్లో విసురుగా కూర్చున్నాడు అతను.

గోల్కొండ శిథిలాలముందు ఆగింది 'మనోరమ'

ఆ శిథిలాల్లో ఇంకా మిగిలివున్న సౌందర్య చిహ్నాలను, కొన్ని సాంకే

తీక విచిత్రాలను నవాబుల గోరీలను అన్నిటినీ చూసేరు.

అశాశ్వతమైన జీవితాలకీ, క్షణిక మైన భోగాలకు, వైభవాలకు నిదర్శనంగా నిలిచిన ఆ శిథిలాలు ఆలోచన గల ప్రతి వ్యక్తినీ తాత్కాలికమైన వేదాంత భావనలోకి దింపుతాయ్.

ఆ శిథిలాల్లో తిరుగుతున్నంతసేపూ ఎలిజా హృదయం శూన్యంగా ఉండి పోయింది

ఒకగంటలో అన్నీ చూసి మళ్ళీ బస్సులోకి వచ్చేరు అంతాను మధ్యాహ్నం మూడుగంటలయింది. అప్పటికి అంతా అలసిపోయేరు. బయల్దేరినప్పుడున్న ఉత్సాహం ఎవ్వరిలోనూ లేదు.

షేర్వాణీవాలా నిద్రమత్తుతో తూల్తున్నాడు

ఖద్దరులాల్చీ పెద్దమనిషి అప్పుడే గుర్రుపెడ్తూ నిద్రపోసాగేడు చల్లగాలికి అతని అనుచరుడుకూడా తమ నాయకుడి మార్గాన్నే అవలంబించ దలచుకున్నట్లు కనపడుతున్నాడు

రోమన్ క్రాపు నీరసంగా బయటకు చూస్తూ కూర్చున్నాడు.

కుటుంబయ్యగారు ఆయనభార్య నిర్లిప్తంగా ఉన్నారు పిల్లలు కొందరు తల్లి ఒడిలో కొందరు తండ్రి భుజంమీద కొందరు సీట్లమీదా కునికిపాట్లు పడుతున్నారు.

పాశ్చాత్యదంపతులకు ఓ పక్క కళ్ళమీద నిద్ర జోగుతూ వస్తున్నా, సభ్యతకోసం రీవిగా కూర్చుని మధ్య మధ్యనే తమ ఆధీనంలో లేకుండా వచ్చిపడుతున్న ఆవలింతలను రుమాళ్ల వెనుక దాచేస్తూ అవస్థపడుతున్నారు. హనీమూన్ దంపతులు ముఖాలు ముటముటలాడిస్తూ కూర్చున్నారు

ఎలిజా మెదడు ఆలోచనా శూన్యంగా ఉంది

తరువాత అలవాటుప్రకారం 'మనోరమ' టాంక్ బండ్ మీదుగా సికింద్రాబాదు వెళ్ళి అందులోని పెద్ద బజార్లన్నీ చూపింది ప్రయాణీకులకు కాని పూర్తిగా వాటిని చూసిన వాళ్ళెవరూలేరు. కొందరు అనాసక్తిగా, కొందరు బద్ధకంగా, కొందరు నిద్రమత్తులో చూసేరు

చివరికి సాయంత్రం ఐదుగంటల వేళకి తిరిగి ఇన్ఫర్మేషన్ ఆఫీసును చేరుకుంది మనోరమ.

ఎలిజా లోపలికివెళ్ళి అధికారుల కోసారి కనిపించి, ఆనాడు తనతో కలసి ప్రయాణంచేసిన వారందరికీ చిరునవ్వుతో వీడ్కోలు చెప్పింది. తరువాత రిక్షా మాట్లాడుకుని ఇంటి వైపుకు వెళ్ళింది.

రిక్షాలో కూర్చున్న ఎలిజాలో ఇప్పుడెలాంటి ఆలోచనలూ లేవు; ఆఖరికి ఉదయంనుండి ఆమెలో ఉంటూవస్తున్న తన సౌందర్యాన్ని గూర్చిన 'కాంశస్

నెస్ 'కూడా ఆమెలో లే దిప్పుడు. అందుకే ఆమె యీ సమయంలో ఉదయముకన్న అందహీనంగా, ఆకర్షణ రహితంగా ఉంది. ఆమె పెదవులకు, బుగ్గలకు రాసుకున్న రంగులు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చెయ్యక పోగా పైగా అతికించినట్లు కనపడుతున్నయ్.

ఆమె కళ్ళలో మెరుపుతీగలకు మారుగా నీలినీడలుకదలాడుతున్నయ్- యిప్పుడు.

ఇంటిముందు రిక్షాదిగి రిక్షావాడికి డబ్బు లిచ్చి లోపలికి నడచింది. ఆమె ఉంటున్న అద్దెయింటికి రెండే రెండుగదులు, ఒకవంటగది ఉన్నయ్. ముందుగది డ్రాయింగురూమ్‌గాను వెనకనే వంటగది నానుకుని ఉన్నగది బెడ్ రూమ్ గాను ఉపయోగపడుతున్నయ్

ఎలిజా డ్రాయింగు రూములోనుండి నడచింది. అక్కడనుండి బెడ్‌రూమ్‌కి దారితీసే ద్వారం ఒకటుంది. వంటయింట్లోకి పోవాలంటే బెడ్‌రూమ్‌లోనుండే వెళ్ళాలి.

గదిగుమ్మం దగ్గర ఆగిపోయింది ఎలిజా

ఓరగా వేసివున్న తలుపులను అనాలోచితంగా నెట్టింది కొద్దిగా. సగం తెరుచుకున్న తలుపులు తనకు చూపించిన దృశ్యాన్ని తిలకిస్తూనే స్థాణువులా నిల్చుండిపోయింది -ఎలిజా.

కాని ఆదృశ్యానికి కారకులైన

వ్యక్తులు ఆమెరాకను గమనించే స్థితిలో లేరు.

బ్రాందీ వాసనలతో గుప్పుమంటూన్న ఆ గదిలో మంచంమీద మత్తుగా పడుకుని ఉంది ఒక సుందరి– యించుమించు నగ్నంగా, ఆమెనడుము చుట్టూ చేతులువేసి ఆమె పెదవుల లిప్‌స్టిక్కుని రుచిచూస్తున్నాడు థామస్ – ఎలిజా భర్త!

"డార్లింగ్! నువ్వెంత అందంగా ఉన్నావు!" థామస్ అంటున్నాడు.

"ఊఁ! మీ ఎలిజాకంటె అందంగా ఉన్నానా?" గాజులు పగిలినట్లు గలగలమంటూ నవ్వింది–మేరీ.

"నో స్వీట్! ఆ పాపిష్టి ఎలిజా మాట నా ముందెత్తకు. రాచిప్ప మొహమూ అదీని! నీ ముందు అదెక్కడ?" అంటూ ఆమెను మరింత దగ్గరగా లాక్కున్నాడు థామస్.

"ఊఁ. అబ్బ! ఉండు డాలీ! ఏమిటా మోటుతనం!" అంటూ సన్నగా రాగాలు తీస్తూ తనబుజాలమీద నిరాధారంగా వేలాడుతున్న బ్రేసియర్‌ని లాగి అవతల పారేసింది మేరీ.

చటుక్కున తలతిప్పేసుకుంది ఎలిజా, గుమ్మాన్ని పట్టుకున్న ఆమె చేతివేళ్లు పట్టు తప్పినయ్. ఆమెకళ్ళు చూసే శక్తిని, చెవులు వినేశక్తిని కోల్పోతున్నయ్.

తూలుతూ పక్కకుజరిగి గోడకు చేరగిలబడి నిల్చుంది ఎలిజా. ఆమె కళ్ళలో క్రమ్ముకుంటున్న కన్నీరు పరిసరాలను అదృశ్యం చేసేస్తోంది. ఆ కన్నీరు ఆమె బుగ్గలమీదుగా జారి వాటిమీద ఉన్న అందమైన రంగును కరగించి ఆమె గుండెలోకి దిగి అందులో రగుల్తున్న జ్వాలలను చల్లార్చటానికి వ్యర్థప్రయత్నం చేస్తోంది.

ఏడుస్తూన్నందువల్ల విచ్చుకున్న ఆమె పెదవులమీది లిప్‌స్టిక్కు పగుళ్లుబారి వికృతంగా తయారయింది.

కాని కరిగిపోతున్న తన సౌందర్య చిహ్నాలమీద ధ్యాసేలేదు ఎలిజాకి

ఆమె యిప్పుడు స్త్రీ.

సమస్త నారీ ప్రపంచంలోని ఆశలు, నిరాశలు, నిస్పృహా, నిస్సహాయతా, అసూయా, ఆరాటం తనగుండెలో దాచుకున్న స్త్రీ – ఎలిజా!

ఆ క్షణంలో తన జీవిత గమ్యమేమిటో, తన భవిష్యత్తేమిటో తనకే తెలియని అయోమయ స్థితిలో నిల్చుండిపోయింది ఎలిజా.